# క్రొత్త నిబంధన - క్రొత్త చట్టం

కావున నా సహోదరులారా, మనము దేవునికొరకు ఫలమును ఫలించునట్లు మృతులలోనుండి లేపబడిన క్రీస్తు అను వేరొకని చేరుటకై మీరును ఆయన శరీరముద్వారా ధర్మశాస్త్రము విషయమై మృతులైతిరి. ఏలయనగా మనము శరీరసంబంధులమై యుండినప్పుడు మరణార్థమైన ఫలమును ఫలించుటకై, ధర్మశాస్త్రమువలననైన పాపేచ్ఛలు మన అవయవములలో కార్యసాధకములై యుండెను. ఇప్పుడైతే దేనిచేత నిర్బంధింపబడితిమో దానివిషయమై చనిపోయినవారమై, ధర్మశాస్త్రమునుండి విడుదల పొందితిమి గనుక మనము అక్షరానుసారమైన ప్రాచీనస్థితి గలవారము కాక ఆత్మానుసారమైన నవీనస్థితి గలవారమై సేవచేయుచున్నాము (రోమా 7:4-6).

పాత నిబంధన చట్టానికి లోనైనవారు, జన్మతోనే నిబంధన సంబంధమైన పిల్లలై ఉన్నారు, వారు ధర్మశాస్త్రం క్రింద జన్మించినవారైయున్నారు. నిబంధన వారికి వారి దేవునికి మధ్య నిలిచియుంటుంది. వారు నిబంధనయొక్క షరత్తులకు లోబడినవారైయుంటే, వారు వృద్ధి చెందుతారు, దేశంలో దీర్ఘాయువుగలవారై ఉంటారు. వారు అవిధేయులైతే, శిక్ష యొక్క ప్రతిఫలాన్ని అనుభవిస్తూ దేశంనుండి తోలివేయబడతారు.

ఆవశ్యకంగా ధర్మశాస్త్రం చూపించిన క్రొత్త నిబంధన, పూర్ణంగా నూతనమైనదియు వేరైన నియమమునైయుంది. క్రొత్త నిబంధన సంబంధులమైన పిల్లలమై ఉండగోరితే, మనం క్రొత్తగా జన్మించాలి (యోహాను 3:3-5). క్రొత్త నిబంధన క్రింద వాగ్దానం చేయబడిన నిత్యమైన పరలోకపు దీవెనలను గూర్చిన నిరీక్షణ కలుగక ముందు (1 పేతురు 1:3, 4), యిది జరుగవలసియుంది. మనం ప్రేమ పూర్వకంగాను యిష్టపూర్వకంగాను సేవించుతూ, భయభక్తులతో వెంటాడే ఒక స్నేహితుణ్ణి క్రొత్త నిబంధన ప్రసాదిస్తుంది. క్రొత్త నిబంధన క్రింద, హృదయపూర్వకంగా సేవిస్తాం. మన ప్రభువును రక్షకుడునైన యేసు క్రీస్తు కొరకు మనం జీవింపగోరతాం.

ధర్మశాస్త్రం ద్వారా గాక, ప్రభువైన యేసు ద్వారా మానవాళిని రక్షించాలని జగత్తు పునాది వేయబడకమునుపే, అంటే భూమ్యాకాశములను సృజింపక ముందే దేవుడు నిర్ణయించుకున్నాడు (అపొ. 2:23; 1 పేతురు 1:18-20). అబ్రాహాము సంతానం ద్వారా దేవుడు వాగ్దానం చేసిన ఆశీర్వాదములను ధర్మశాస్త్రం తీసికొని రాలేదు (ఆది. 22:18; గలతీ. 3:16). సరిగదా, అది దాని జనులను శాపం క్రిందికి తెచ్చింది. ఆజ్ఞాపింపబడిన సమస్తాన్ని ఒకడు ఆచరింపక పోయినట్లయితే (యాకోబు 2:10), అతడు శాపమునకు లోనైయున్నాడు (గలతీ. 3:10) - అందులో ప్రభువైన యేసు తప్ప దాన్ని పరిపూర్ణంగా నేరవేర్చినవాడు ఒక్కడును లేదు.

క్రీస్తు అనే అబ్రాహాము సంతతి ద్వారా, సమస్త జనములను ఆశీర్వదిస్తానని దేవుడు అతనితో చేసిన నిబంధనను ధర్మశాస్త్రం వ్యర్థపరచిందని దీని భావం కాదు. పౌలు

విషయాన్ని యిలా వివరించాడు: "... నాలుగువందల ముప్పది సంవత్సరములైన తరువాత వచ్చిన ధర్మశాస్త్రము, వాగ్దానమును నిరర్థకము చేయునంతగా పూర్వమందు దేవునిచేత స్థిరపరచబడిన నిబంధనను కొట్టివేయదు" (గలతీ. 3:17). ధర్మశాస్త్రం ఆశీర్వాదమును తేలేకపోయింది, ఎందుకంటే దానిక్రిందనున్న వారందరిని అది శపించింది. ఈ శాపము ధర్మశాస్త్రం ద్వారా తొలిగింపబడలేదు, అది తరువాత క్రీస్తుచేత తొలిగింపబడుతుంది. క్రీస్తు వచ్చినప్పుడు, ఆయన "మనకోసము శాపమై మనలను ధర్మశాస్త్రముయొక్క శాపమునుండి విమోచించెను; ఇందును గూర్చి – మ్రానుమీద వ్రేలాడిన ప్రతివాడును శాపగ్రస్తుడు" అని వ్రాయబడియున్నది (గలతీ. 3:13). గలతీ. 2:21లో మనం యిలా చదువుతాం: "ధర్మశాస్త్రము దేవుని వాగ్దానములకు విరోధమైనదా? అట్లనరాదు. జీవింప చేయ శక్తిగల ధర్మశాస్త్రము ఇయ్యబడియున్న యెడల వాస్తవముగా నీతి ధర్మశాస్త్ర మూలముగానే కలుగును" (అప్పుడు క్రీస్తు మరణం అవసరం లేనట్టే గదా?).

## (క్రీస్తు యొక్క చట్టము) క్రీస్తు నియమము

పాత, క్రొత్త నిబంధనలకు మధ్యగల వ్యత్యాసము చట్టముల స్వభావంలో ఉన్నట్టే ఉంది గాని, చట్టం కావాలా వద్దా అనేదాంట్లో లేదు. ఎవరి హృదయాలు దానివైపు మార్చబడలేదో వారు అనుసరించవలసిన నియమావళితో కూడింది మొదటిది. దేవుని ధర్మవిధులు వారి హృదయాల మీద వ్రాయబడియుండవలసిన అవసరత అందులో లేదు. క్రొత్త నిబంధన యొక్క విధానమైతే, జనుల జీవితంయొక్క భౌతిక విషయాలను నడిపించడానికి వ్రాయబడిన నియమావళికంటె గొప్పది. ఇప్పుడు మన హృదయాలలో చట్టముయొక్క రూపం వ్రాయబడింది, అది మన జీవితాలలో మార్పు తేవలసియుంది. క్రైస్తవులంగా, క్రీస్తును బట్టి మనకు నూతన జీవితం ఉంది. మన ఆదర్శము, జీవితాలు, నియమాలు హృదయంలో వ్రాయబడి ఉంటాయి.

యేసు క్రీస్తుకు చట్టముంది. "క్రీస్తు నియమాన్ని" నెరవేర్చండి అని పౌలు వ్రాశాడు (గలతీ. 6:2). "దేవుని విషయమై ధర్మశాస్త్రము లేనివాడను కాను గాని క్రీస్తు విషయమై ధర్మశాస్త్రమునకు లోబడిన"వాడనని పౌలు తన్ను గూర్చి తాను వర్ణించుకున్నాడు (1 కొరింథీ. 9:21).

"క్రీస్తు నియమము" అంటే, దేవుని ఆనందింపజేయడానికిగాను స్వనీతి మీద ఆధారపడి జరిగించే మెచ్చదగిన కార్యాలు కావు. ఈ నియమము క్రీస్తు యొక్క కార్యాలమీద అధారపడిన విశ్వాసమైయుంటుంది – ఆయన వాక్యంలో బయలుపరచిన ఆయన చిత్తానికి లోబడేలా ఆలాంటి విశ్వాసం ప్రోత్సహిస్తుంది. మనం మంచితనాన్ని బట్టి కాక, ఆయనవలన మనం రక్షింపబడ్డామని గుర్తించవలసియుంటుంది. క్రీస్తు నియమము క్రియా నియమము కాదు. అది విశ్వాస నియమమైయుంది. "కాబట్టి అతిశయ కారణమెక్కడ? అది కొట్టివేయబడెను. ఎట్టి న్యాయమును బట్టి అది కొట్టివేయబడెను? క్రియాన్యాయమును బట్టియా? కాదు, విశ్వాస న్యాయమును బట్టియే. కాగా ధర్మశాస్త్ర సంబంధమైన క్రియలు లేకుండ విశ్వాసమువలననే మనుష్యులు నీతిమంతులుగా

తీర్చబడుచున్నారని యెంచుచున్నాము" (రోమా 3:27, 28).

"ధర్మశాస్త్రానికి," "చట్టము లేక నియమము" అనే దానికిని ముఖ్యమైన భేదముంది. రోమా 3:31లో యిలా వ్రాయబడియుంది: "విశ్వాసము (నియమము) ద్వారా ధర్మశాస్త్రమును నిరర్థకము చేయుచున్నామా? అట్లనరాదు; ధర్మశాస్త్రమును స్థిరపరచుచున్నాము."

హూ. జె. స్కో ఫీల్డ్ ఈ వచనాన్ని సరిగా తర్జుమా చేశాడు: "ధర్మశాస్త్రాన్ని నిరర్థకం చేయడానికి మనం విశ్వాసాన్ని వినియోగిస్తున్నామా? అట్లనరాదు! ధర్మశాస్త్రాన్ని స్థిరపరచుతున్నాం."[1] వివరణగా, ఈ ఫుట్‌నోట్సును చేర్చాడు: "విశ్వాస నియమాన్ని బిగబట్టడంవలన."[2]

కిన్నెత్ ఎస్. వెస్ట్ ఈ తర్జుమా నిచ్చాడు: "అప్పుడు, తరువాత ప్రస్తావించబడిన విశ్వాసం ద్వారా ధర్మశాస్త్రాన్ని నిరర్థకం చేస్తున్నామా? అలాటి ఆలోచనే రాకూడదు. తప్పక, మనం నియమాన్ని స్థాపిస్తున్నాం."[3]

విశ్వాసము హద్దులు లేనిదిగాని సూత్రాలు లేనిదిగాని కాదు. కాని అది స్థిరముగా నిలిచే సూత్రాలు కలిగినదైయుంటుంది. ఈ కారణాన్ని బట్టి మనము విశ్వాస నియమాన్ని గూర్చి మాట్లాడవచ్చు. "ఇది క్రీస్తు యొక్క నియమమై" (లేక ధర్మశాస్త్రమై) యుంది.

పౌలు యిలా వ్రాశాడు: "క్రీస్తుయేసునందు జీవమునిచ్చు **ఆత్మ**యొక్క నియమము పాపమరణముల నియమమునుండి నన్ను విడిపించెను" (రోమా 8:2). క్రీస్తు యొక్క నియమము (లేక ధర్మశాస్త్రము) విశ్వాస నియమము మరియు ఆత్మ నియమమునై ఉంది. ఇది "దేవుని ధర్మశాస్త్రమని" కూడా పిలువబడింది (రోమా 7:22, 25; 1 కొరింథీ. 9:21) మరియు "స్వాతంత్ర్యమునిచ్చు సంపూర్ణమైన నియమము" అని పిలువబడుతుంది (యాకోబు 1:25; 4:12). క్రీస్తు నియమంనుండి మనలను విడుదల చేయలేదు, (చట్టం, లేక) నియమం యొక్క స్వభావాన్ని మార్చాడు (హెబ్రీ. 7:12).

మనకు ఏ విధమైన చట్టము లేక నియమము లేకుంటే, మనం పాపం చేయనేలేం: "ధర్మశాస్త్రము లేనియెడల అతిక్రమము లేకపోవును" (రోమా 4:15బి). "ధర్మశాస్త్రము లేనప్పుడు పాపము ఆరోపింపబడదు" (రోమా 5:13బి). ఇది నిజమైయుండేదే, క్రీస్తు చనిపోయే అవసరత లేకుండేదే; ఎందుకంటె, మనకు చట్టమే లేకుంటే, క్రీస్తు మరణం క్షమించే ఏ పాపము మనకు లేకపోయేదే. క్రైస్తవులు నియమం (చట్టం) లేనివారు కారు; వారు క్రీస్తు యొక్క ధర్మశాస్త్రం లేక నియమం క్రింద ఉన్నారు.

## ప్రేమ నియమం

ఇతరులకు ఏ కీడూ చేయకూడదనే సందర్భంలో మొదటి నిబంధన రూపింపబడింది – అందునుబట్టి, హత్య చేయవద్దు. అబద్ధమాడవద్దు, దొంగిలవద్దు, మరొకని భార్యతో వ్యభిచరింపవద్దు అంటూ సంగతులు వివరింపబడ్డాయి. ఇతరులకు ఉపకారం చేసేదాని గూర్చి ఎక్కువగా చెప్పబడలేదు (లేవీయ. 19:18బి చూడు). క్రీస్తు యేసు యొక్క చట్టమైతే, "ఒకని భారములనొకడు భరించి, యీలాగు క్రీస్తు నియమమును పూర్తిగా నెరవేర్చుడి" (గలతీ. 6:2) అని అంటుంది. ఇతరులకు ఏ విధమైన హాని చేయకూడదు

అనేదాన్ని అది అధిగమించి, యితరులకు సేవ చేయుడి అనేదాన్ని నొక్కి చెప్పుతుంది. దేవుడు మాత్రమే తీర్పు తీర్చగల హృదయాన్ని క్రీస్తు నియమం చూస్తుంది. అధికంగా ధర్మశాస్త్రం భౌతికమైన కార్యాలవైపే చూస్తుంది; అతిక్రమములను గూర్చి ఆలోచించాలి, తీర్పు తీర్చాలి సమాజం అట్టివారిని శిక్షించాలి (లేవీయ. 19:15). ఇతరులకు హాని చేయకూడదని చెప్పడం మాత్రమే గాక, క్రీస్తు నియమం మేలు చేసే కార్యాలను కలిగియుంది. బహు గొప్ప వ్యత్యాసమేమంటే, న్యాయవిధుల పట్ల కలిగియుండే బాధ్యతలకంటె, వ్యక్తితో ఉండే బాంధవ్యం నేడు ప్రాముఖ్యమై ఉంది. రాళ్ల మీద చెక్కబడిన ఆజ్ఞలను తిలకించేదానికి బదులు, మనకు మాదిరియైయున్న క్రీస్తువైపు మనం తేరి చూస్తాం.

క్రీస్తునందు చేయబడిన క్రొత్త నిబంధన హృదయాల మీద వ్రాయబడవలసి ఉంది. ఇది యిర్మీయాచే ప్రవచింపబడింది: “ఈ దినములైన తరువాత నేను ఇశ్రాయేలువారితోను యూదావారితోను చేయబోవు నిబంధన యిదే, వారి మనస్సులలో నా ధర్మవిధి ఉంచెదను, వారి హృదయముమీద దాని వ్రాసెదను; యెహోవా వాక్కు ఇదే” (యిర్మీయా 31:33).

తన ప్రజల కొరకు దేవుడు చట్టం లేకుండా చేస్తాడని యిర్మీయా ప్రవచింపలేదు, కాని ఆయన ధర్మవిధిని వారి హృదయాల మీద వ్రాస్తానని ఆయన తెలియజేశాడు. తన ఆజ్ఞల మూలంగా ఆయన వారికి తెలియబడేదానికంటె, తన కనికరమునుబట్టి దేవుడు ఎరుగబడినవాడై ఉంటాడు. ప్రజలు దేవుని ఎరిగే విధానాన్ని గూర్చి ప్రవక్త యిలా వివరించాడు: “నేను వారి దోషములను క్షమించి వారి పాపములను ఇక నెన్నడును జ్ఞాపకము చేసికొనను గనుక అల్పులేమి ఘనులేమి అందరును నన్నెరుగుదురు; ఇదే యెహోవా వాక్కు” (యిర్మీయా 31:34బి). మన పాపముల కొరకైన క్రీస్తు బలి ద్వారా, దేవుడు, తాను దయ, ప్రేమ, కనికరము, కృపగల దేవుడైయున్నట్టు తన్ను తాను బయలుపరచుకున్నాడు. క్రొత్త నిబంధన క్రింద, దేవుడు క్రీస్తు ప్రభువు ద్వారా ఎరుగబడతాడు. ఈ కారణాన్ని బట్టి, దేవుడు క్రీస్తు ద్వారా తన స్వభావం యొక్క లోతులను ఒక రకంగా బయలుపరచడం ద్వారా ఆయన తన ప్రజలకు పరిచర్య జరిగించినందున, మనం దేవుని సేవించువారమై ఉంటాం (రోమా 11:33). క్రీస్తు ద్వారా ఆయన తన్ను తాను బయలుపరచుకొన్నాడు (యోహాను 1:18).

## ఆత్మానుసారమైన నవీన స్థితి

మోషే ధర్మశాస్త్రానికిని క్రీస్తు ధర్మశాస్త్రానికిని మధ్యగల ప్రధాన వ్యత్యాసాలలో మరొకటి పరిశుద్ధాత్మను సమీపించే విధానం. “మనము అక్షరాను సారమైన ప్రాచీన స్థితి గలవారము కాక ఆత్మానుసారమైన నవీనస్థితి గలవారమై సేవచేయుచున్నాము” (రోమా 7:6బి). క్రైస్తవుని ఉద్దేశం కేవలం చట్టాన్ని అనుసరించడం మాత్రమే కాదు, కాని ప్రభువును అభినందించడంలోను, ప్రేమ కలిగించే స్వభావం మీదను ఆధారపడి ఉంటుంది (యోహాను 14:15, 21, 23).

తల దువ్వుకో, పండ్లు తోముకో, స్నానం చేయి అంటూ తల్లి చిన్న బిడ్డకు ఎంతగా

చెప్పి అతని ఆకారం లేక కనబడే విధానం మీద అక్కర కనుపరచినా ఎక్కువ ఫలితం కలుగక పోవచ్చు. వయస్సు వచ్చింది, ప్రేమలో పడ్డాడనుకో, నిస్సందేహంగా తన పై రూపాన్ని గూర్చి ఎంతో శ్రద్ధ తీసికొంటాడు. అలాగే కేవలం ఆజ్ఞలకు లోబడేదానికి బదులు తాను ప్రేమించిన వ్యక్తి యొక్క కోర్కెలకు విధేయుడై ఉండగోరతాడు. ఈ విధంగా అతడు మార్పు చెందుతూ ఉంటాడు.

పౌలుకు జరిగింది అదే. అతడు క్రీస్తు వైపు తిరిగినప్పుడు, ధర్మశాస్త్రమందున్న నీతిని అతడు ఏ మాత్రము వెదక కోరలేదు, సరిగదా – ఆయనను ఆనందింపజేయునట్లు, ప్రభువైన యేసును గూర్చిన జ్ఞానాన్ని సంపాదింపజూచాడు (ఫిలిప్పీ. 3:7–14). ప్రభువు తనకై చేసినదానికి అభినందనగా ఆయనతో సిలువ వేయబడిన వాడయ్యాడు (గలతీ. 2:20) ఆయనతో తనకున్న సంబంధాన్ని బట్టి కూడా అలా జరిగింది. ఈలాటి రూపాంతరం మనం బాప్తిస్మం పొందినప్పుడు జరుగవలసియుంది.

> కాబట్టి తండ్రి మహిమవలన క్రీస్తు మృతులలోనుండి యేలాగు లేపబడెనో, ఆలాగే మనమును నూతనజీవము పొందినవారమై నడుచుకొనునట్లు మనము బాప్తిస్మమువలన మరణములో పాలుపొందుటకై ఆయనతోకూడ పాతిపెట్టబడితిమి. మరియు ఆయన మరణముయొక్క సాదృశ్యమందు ఆయనతో ఐక్యముగలవారమైన యెడల, ఆయన పునరుత్థానము యొక్క సాదృశ్యమందును ఆయనతో ఐక్యముగలవారమై యుందుము. ఏమనగా మనమికను పాపమునకు దాసులము కాకుండుటకు పాపశరీరము నిరర్థకమగునట్లు, మన ప్రాచీన స్వభావము ఆయనతో కూడ సిలువవేయబడెనని యెరుగుదుము (రోమా 6:4–6).

## అనుసరించడానికి ఒక మాదిరి

క్రొత్త నిబంధన క్రింద, ప్రభువైన యేసు యొక్క ఆజ్ఞలు అనుసరించడమే మన గమ్యం కాదు, ఆయనవలె ఉండడమైయుంది. “మనమాయన ఆజ్ఞలను గైకొనిన యెడల, దీనివలననే ఆయనను ఎరిగియున్నామని తెలిసికొందుము ... ఆయనయందు నిలిచియున్న వాడనని చెప్పుకొనువాడు ఆయన ఏలాగు నడుచుకొనెనో ఆలాగే తానును నడుచుకొన బద్ధుడైయున్నాడు. మన మాయనయందున్నామని దీనివలన తెలిసికొను చున్నాము” (1 యోహాను 2:3–6). ఆయన ఆజ్ఞలను అనుసరించుతూ, ఆయన నడుచుకొన్నట్టు మనము నడుచుకొన్నట్టయితే మనం ప్రభువును ఎరిగినవారమై ఉంటాం.

మనమెలా నడుచుకోవాలో దానికై యేసు మాదిరి ఉంచిపోయాడు. “క్రీస్తుకూడ మీకొరకు బాధపడి, మీరు తన అడుగుజాడలయందు నడుచుకొనునట్లు మీకు మాదిరి యుంచిపోయెను” (1 పేతురు 2:21). ఇతరులకు సేవ చేయడంలో ఆయన మరణం కూడా మాదిరియై ఉంది. “ఆయన మన నిమిత్తము తన ప్రాణముపెట్టెను గనుక దీనివలన ప్రేమ యెట్టిదని తెలిసికొనుచున్నాము. మనముకూడ సహోదరుల నిమిత్తము మన ప్రాణములను పెట్ట బద్ధులమై యున్నాము” (1 యోహాను 3:16).

జీవితంలోని ప్రతి విధానంలోను క్రైస్తవుడు క్రీస్తునందు ఎదగాలి అనే గమ్యం కలిగియుండాలి. ఈ విధంగా క్రొత్త నిబంధన, పాత నిబంధన కంటె వ్యత్యాసమైనదిగా

ఉంది. దాని గురి కేవలం ఆజ్ఞలననుసరించడం కాదు, అది క్రీస్తును అనుకరించడం కూడా అయ్యింది (ఫిలిప్పీ. 2:5 చూడు).

## ముగింపు

క్రీస్తు యొక్క నియమము, నూతన ధర్మశాస్త్రము, క్రీస్తువంటి జీవితాన్ని పోలిన నూతన సేవా విధానాన్ని కలిగియుండాలి. ఆయన యెడల మనకున్న ప్రేమ, బాంధవ్యాలను బట్టి, మనము ఆయనను ఆనందింపజేయ కోరతాం. చట్టం యొక్క డిమాండ్స్‌కు మాత్రమే మనం లోబడడం కాదు. మార్పు చెందిన హృదయాలను బట్టి ఆయన మాదిరిని అనుసరించుతూ, ఆయనను సేవించాలి.

మనము ఆజ్ఞానుసారమైన ప్రాచీన స్థితి గలవారము కాక ఆత్మానుసారమైన నవీన స్థితిగలవారమై సేవ చేయుచున్నాము.

---

సూచనలు

[1]Hugh J. Schonfield, ed. and trans., *The Authentic New Testament* (New York: Mentor Book, 1958), 301. [2]Ibid, footnote 203. [3]Kenneth S. Wuest, *Romans in the Greek New Testament*, Word Studies in the Greek New Testament (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1955), 64.

## ఆజ్ఞలు ధర్మశాస్త్రానికి ఆధారమైయున్నాయి

ప్రతి చట్టము కూడా ఆజ్ఞలచే నిర్మింపబడినదైయుంది. దీన్ని మరో మార్గంలో చెప్పాలంటే, ఆజ్ఞలే చట్టానికి ఆధారమైయుంటాయి. దేవుడు ఇశ్రాయేలీయులకు యిచ్చిన ధర్మశాస్త్రాన్ని గూర్చి పౌలు వ్రాస్తూ, అది ఆజ్ఞలతో కూడినదైయున్నట్టు సూచించాడు (రోమా 7:7, 8). ప్రభువైన యేసు యొక్క చట్టము ఆయన ఆజ్ఞాపించిన వాటిమీద నిర్మించబడింది – తనకు శిష్యులైయుండ గోరినవారికి అవి బోధించబడాలి, వారు వాటిని గైకొనాలి (మత్తయి 28:20).

క్రొత్త నిబంధనలో “ఆజ్ఞ” అనేది చెడ్డ పదం కాదు. ఎందుకంటె, క్రీస్తు ప్రభువుతో మన బాంధవ్యము ఆయన ఆజ్ఞలను అనుసరించడం మీద ఆధారపడుతుంది. ఆయన మనకు ఆజ్ఞాపించిన వాటిని మనం గైకొంటే ఆయనకు స్నేహితులై యుంటాం (యోహాను 15:14). ఆయనకు మన ప్రేమను విధేయత ద్వారా కనుపరచాలి (యోహాను 14:15). ఆయన మనలను ప్రేమిస్తాడు, తన్ను తాను మనకు బయలుపరచుకుంటాడు, మనం ఆయన ఆజ్ఞలను గైకొనిన యెడల ఆయన మనతో నివసిస్తాడు (యోహాను 14:21, 23). నేడు మనం ఎలా జీవించాలనడానికి ఆయన ఆజ్ఞలే ఆధారమైయుంటాయి (యోహాను 13:34; 14:21–23; 15:10, 12; 1 కొరింథీ. 7:19; 14:37; 1 థెస్స. 4:2; 2 పేతురు 3:2; 1 యోహాను 2:4; 3:22; 5:2, 3), మనం నిత్యజీవం పొందడానికి కూడా అవే ఆధారమైయుంటాయి (యోహాను 12:50).